పేదల అభ్యున్నతే ధ్యేయం

- పలు అభివృద్ధి పనులు ప్రారంభించిన ఎంపీ వెంకటేష్ నేత, ఎమ్మెల్యే దివాకర్‌రావు

నస్పూర్: పేదల అభ్యున్నతి కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెడుతుందని పెద్దపల్లి ఎంపీ వెంకటేశ్ నేత తెలిపారు. ఎమ్మెల్యే దివాకర్‌రావుతో కలిసి బుధవారం ఆయన పట్టణంలో పర్యటించారు. టీయూఎఫ్ఐడీసీ నిధుల నుంచి 10వ వార్డులో నస్పూర్ గేటు నుంచి విలేజ్ నస్పూర్ వరకు రూ.80లక్షలతో రోడ్డు వెడల్పు, 21వ వార్డు అల్లూరి సీతారామరాజు నగర్‌లో రూ.50లక్షలతో కల్వర్టు నిర్మాణం, 18వ వార్డులో రూ.50లక్షలతో కల్వర్టు నిర్మాణం, 7వ వార్డులోని బుడిగజంగాల కాలనీ నుంచి నేషనల్ హైవే వరకు కల్వర్టు నిర్మాణం పనులకు రూ.కోటి నిధులతో మొత్తం రూ 2.80లక్షలతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం కల్యాణ లక్ష్మి, షాదీముబారక్, కంటి వెలుగు, న్యూట్రిషియన్ కిట్ వంటి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టిందన్నారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలకు ప్రజల నుంచి వస్తున్న స్పందనను చూసి ఓర్వలేక స్థానికంగా ఉన్న కొందరు నాయకులు తమ ప్రభుత్వంపై అనవసరపు ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్, వైస్ చైర్మన్ తోట శ్రీనివాస్, కమిషనర్ తన్నీరు రమేశ్, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.



ఎంపీ వెంకటేష్‌నేతకు వినతిపత్రం ఇస్తున్న మేడిపల్లి ఓసీపీ నిర్వాసితులు

ఎంపీ, ఎమ్మెల్యేకు వినతులు

దండేపల్లి: స్థానిక ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన 'తొలిమెట్టు' బోధనాభ్యసన మేళా కార్యక్రమాన్ని తిలకించేందుకు వచ్చిన ఎంపీ వెంకటేష్‌నేత, ఎమ్మెల్యే దివాకర్‌రావుకు మధ్యాహ్న భోజన కార్మికులు సమస్యలపై వినతిపత్రాలు అందించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీకి పక్కా భవనం నిర్మించాలని, పక్కా భవనం లేక చాలా ఇబ్బందులు తలెత్తుతున్నాయని, ప్రిన్సిపాల్ శోభ, సిబ్బంది ఎంపీ, ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి, వినతిపత్రం అందించారు.

పరిహారం ఇప్పించాలని వినతి

పాతమంచిర్యాల: పెద్దపల్లి జిల్లా మేడిపల్లి ఓసీపీ ఏర్పాటులో భూములు కోల్పోయిన నిర్వాసితులకు ఆర్‌అండ్ ఆర్ ప్యాకేజి ఇప్పించాలని నిర్వాసితులు, సమతా సైనిక్‌దళ్ నాయకులు జిల్లా కేంద్రంలోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో పెద్దపల్లి ఎంపీ వెంకటేష్‌నేతకు బుధవారం వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో మేడిపల్లి ప్రజలు సానాపురి శ్రీనివాస్, రామటెంకి మల్లేష్, విశ్వనాథ్, కోట రాజయ్య, లింగయ్య, చందనగిరి శివ, శివరామకృష్ణ, కోట లక్ష్మి, ప్రమీల, సమతాసైనిక్ దళ్ రాష్ట్ర నాయకులు దుర్గం నగేష్ పాల్గొన్నారు.

'ప్రజల అభివృద్ధి కోసం కృషి'

లక్సెట్టిపేట: ప్రజల అభివృద్ధికి బీఆర్ఎస్ పార్టీ కృషి చేస్తుందని ఎంపీ వెంకటేష్ నేత అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డులో సీసీ రోడ్లను ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే దివాకర్‌రావు, డీసీఎమ్మెస్ చైర్మన్ లింగయ్య, మున్సిపల్ చైర్మన్ కాంతయ్య, వైస్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతమే లక్ష్యంగా పనిచేయాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్

బెల్లంపల్లి: భారతీయ జనతా పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేయడానికి ప్రతి కార్యకర్త అంకితభావంతో పని చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వి.రఘునాథ్ సూచించారు. బెల్లంపల్లి అగర్వాల్ భవన్‌లో బుధవారం నిర్వహించిన శక్తి కేంద్ర ఇన్‌చార్జులు, ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వచ్చే ఎన్నికల కోసం పార్టీని సంస్థాగతంగా పటిష్ఠం చేయాల్సిన అవసరం ఉందన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని, పార్టీని విజయతీరాలకు తీసుకెళ్లాల్సిన బాధ్యతను బీజేపీ శ్రేణులు తీసుకోవాలని వివరించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మునిమంద రమేష్, అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి సుదర్శన్ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు పుల్గం తిరుపతి, సీనియర్ నాయకుడు కొయ్యల ఏమాజీ, ఎంపీటీసీ హరీష్ గౌడ్, అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ రాచర్ల సంతోష్‌కుమార్, నాయకులు కేశవరెడ్డి, కృష్ణదేవరాయలు, రాజులాల్ యాదవ్, కౌన్సిలర్ అనిత తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రఘునాథ్

అటల్ బిహారీవాజ్‌పేయ్ స్మారక క్రికెట్ పోటీలు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మండల బీజేపీ యువమోర్చ ఆధ్వర్యంలో బుధవారం దివంగత ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయ్ స్మారక క్రికెట్ టోర్నమెంట్ పోటీలను రఘునాథ్ వెరబెల్లి ఫౌండేషన్ సహకారంతో ఏర్పాటు చేశారు. ఈ పోటీల్లో భాగంగా టీకానపల్లి, హాజీపూర్ గ్రామాల మధ్య జరిగిన మొదటి మ్యాచ్‌ను బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ ప్రారంభించగా క్రీడాకారులను పరిచయం చేసుకుని టాస్ వేసి మ్యాచ్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో పెద్దపల్లి పురుషోత్తం, మోటపలుకుల తిరుపతి, వెంకటరమణారావు, స్వామిరెడ్డి, రాజేశ్, కోట సాయినవీన్, చౌతకారి రాకేశ్, అభిలాశ్, రఘు, స్థానికులు పాల్గొన్నారు.

అంబేద్కర్ భవనం పరిశీలన

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని పాతబస్టాండ్ సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న అంబేద్కర్ సంఘం భవనాన్ని ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు బుధవారం పరిశీలించారు. పనులను వేగవంతం చేయాలని సూచించారు. సంఘం మండలాధ్యక్షుడు నర్సయ్య, నాయకులు పాల్గొన్నారు.



న్యూస్‌రీల్

పాత స్తంభాలు తొలగించి.. కొత్తవి వేయించి



కొత్తగా వేసిన స్తంభాలు

సాక్షి ఎఫెక్ట్..

నెన్నెల: నెన్నెల–బెల్లంపల్లి రహదారిలో దుగినేపల్లి వద్ద వంగిపోయి ప్రమాదకరంగా ఉన్న రెండు స్తంభాలను విద్యుత్‌శాఖ అధికారులు బుధవారం తొలగించి కొత్త స్తంభాలు వేయించారు. ఈ నెల 2న 'పడిపోకముందే పట్టించుకోండి' అనే శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి బెల్లంపల్లి రూరల్ విద్యుత్ ఏఈ రాంమనోహర్ స్పందించారు. క్రేన్ సాయంతో రెండు స్తంభాలను వేయించి సమస్య లేకుండా చేశారు. ఏళ్ల తరబడి ఉన్న సమస్యను 'సాక్షి' పత్రిక ద్వారా పరిష్కరించడంపై ప్రజలు 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు.

తహసీల్దార్ కార్యాలయం సందర్శన



తహసీల్దార్‌ను వివరాలు అడిగి తెలుసుకుంటున్న ట్రెయినీ కలెక్టర్

దండేపల్లి: స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని ట్రెయినీ కలెక్టర్ గౌతమిపూజారి బుధవారం సందర్శించారు. పలు రెవెన్యూ పరమైన అంశాలతో పాటు, ధరణి పోర్టల్ ద్వారా భూముల రిజిస్ట్రేషన్లు, ఇతర అంశాలను గురించి తహసీల్దార్ హన్మంతరావును అడిగి తెలుసుకున్నారు.

వైద్య రత్న అవార్డు గ్రహీతకు సన్మానం



డాక్టర్ శ్రీనివాస్ యెగ్గనను సన్మానిస్తున్న ఎంపీ వెంకటేష్ నేత

మంచిర్యాలటౌన్: తెలంగాణ హెల్త్ కేర్ అవార్డుల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని ఎయిమ్స్ హాస్పిటల్ సీఈవో, డాక్టర్ శ్రీనివాస్ యెగ్గెన వైద్య రత్న అవార్డును ఇటీవల అందుకోగా బుధవారం పెద్దపల్లి ఎంపీ వెంకటేష్ నేత ఆయన్ను సన్మానించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ మంచిర్యాల జిల్లా నుంచి రాష్ట్ర స్థాయిలో వైద్యరత్న అవార్డును శ్రీనివాస్ అందుకోవడం జిల్లాకే గర్వకారణం అన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పల్లె భూమేష్, కౌన్సిలర్ నల్ల శంకర్, సుంకి సత్యం పాల్గొన్నారు.

పార్టీ నుంచి తొలగింపు

పాతమంచిర్యాల: దళిత బహుజన సమాజ్ పార్టీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు పిట్టల ఈశ్వర్, మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు అనపర్తి కుమారస్వామి యాదవ్‌ను పార్టీ నుంచి క్రమశిక్షణ చర్యల కింద శాశ్వతంగా తొలగిస్తున్నట్లు ఆ పార్టీ పెద్దపల్లి పార్లమెంటు ఇన్‌చార్జి పార్సంది రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఒలింపియాడ్ ఫలితాల్లో ప్రతిభ



ప్రతిభ చూపిన విద్యార్థులు

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని శ్రీ చైతన్య పాఠశాలలో గత నవంబర్‌లో నిర్వహించిన ఒలింపియాడ్ 2 పరీక్షా ఫలితాల్లో తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ చాటినట్లు ప్రధానోపాధ్యాయులు జోబిన్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులను పాఠశాల చైర్మన్ మల్లెంపాట శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, డిజిఎం లక్ష్మణ్, ఆర్ఐ రాజు, కోఆర్డినేటర్ శివలు అభినందించారు.

'చైనా మాంజా అమ్మితే చర్యలు'



లక్సెట్టిపేట: తనిఖీ చేస్తున్న పోలీసులు

లక్సెట్టిపేట/రామకృష్ణాపూర్/మందమర్రిరూరల్: ప్రభుత్వం నిషేదం విధించిన చైనా మాంజాను అమ్మితే చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. లక్సెట్టిపేట, రామకృష్ణాపూర్, మందమర్రిలోని పలు దుకాణాలను తనిఖీ చేశారు. రసాయనాలు పూసి తయారు చేసిన చైనామాంజా అమ్మినా, కొనుగోలు చేసినా నేరమని దీని వల్ల మనుషులకు, పక్షులకు ముప్పు ఉన్నందున అమ్మకాలు చేయరాదని స్పష్టం చేశారు. ఎవరైనా అమ్ముతున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. తనిఖీల్లో రామకృష్ణాపూర్ ఎస్సై అశోక్, లక్సెట్టిపేట ఎస్సై లక్ష్మణ్, మందమర్రి ఎస్సై చంద్రకుమార్, రెండో ఎస్సై మహేందర్ పాల్గొన్నారు.

ఉద్యోగులు క్రీడాస్ఫూర్తిని చాటాలి

జైపూర్: మండల కేంద్రంలో గల సింగరేణి థర్మల్ పవర్‌ప్లాంట్‌లో క్రీడా పోటీలను ఎస్టీపీపీ సీటీసీ సంజయ్‌కుమార్ సూర్, జీఎం డీపీఎస్ఎస్ సూర్యనారాయణ రాజు వోఅండ్ చీఫ్ జెన్‌సింగ్‌తో కలిసి ప్రారంభించారు. సంక్రాంతి పండగ సందర్భంగా సింగరేణి ఉద్యోగులకు నిర్వహించిన క్రికెట్ పోటీల్లో ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సీటీసీ సంజయ్‌కుమార్ సూర్ మాట్లాడుతూ.. క్రీడలతో మానసికోల్లాసంతో పాటు ఆరోగ్యానికి క్రీడలు చాలా దోహదపడుతాయని ఉద్యోగులు అందరూ క్రీడాస్ఫూర్తిని చాటాలని కోరారు. కార్యక్రమంలో ఏజీఎంలు రాజశేఖర్‌రెడ్డి, సత్యనారాయణ ప్రసాద్, సుధాకర్, శ్రీనివాసులు, టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు చుక్కల శ్రీనివాస్, సీఎంవోఏఐ కేంద్ర ఉపాధ్యక్షుడు సముద్రాల శ్రీనివాస్, పీఎం కేసా నారాయణరావు, రామశాస్త్రి, ఈఅండ్ఎం ఎస్ఈ దరావత్ పంతుల, ఎస్టీపీపీ ఉద్యోగులు పాల్గొన్నారు.



పోటీలు ప్రారంభిస్తున్న సీటీసీ సంజయ్‌కుమార్ సూర్, జీఎం సూర్యనారాయణరాజు

ఆడబిడ్డలకు వరం కల్యాణ లక్ష్మి

- బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

నెన్నెల: కులమతాలకు అతీతంగా ఆడబిడ్డలకు అందిస్తున్న కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ పథకాలు పేదింటి ఆడబిడ్డలకు వరమని బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో 27మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. దళారులను ఆశ్రయించకుండా మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకొని రెవెన్యూ సిబ్బందికి అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ రమాదేవి, పీఏసీఎస్ చైర్మన్ మేకల మల్లేష్, తహసీల్దార్ భూమేశ్వర్, నెన్నెల, గొల్లపల్లి ఎంపీటీసీలు తిరుపతి, హరీష్‌గౌడ్, సర్పంచ్‌లు ఇందూరి శశికళ, తోట సుజాత, మల్లేష్, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.



కల్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

బెల్లంపల్లిరూరల్: గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే చిన్నయ్య అన్నారు. మండలంలోని బుధాకలాన్ పరిధిలో నిర్మించిన బృహత్ పల్లె ప్రకృతి వనంలో రూ.50లక్షలతో నిర్మించే పార్క్ పనులను ఆయన ప్రారంభించారు. జెడ్పీ వైస్‌చైర్మన్ సత్యనారాయణ, ఎంపీపీ శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ శ్వేత, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికే టీఎల్ఎం మేళా

జైపూర్/కోటపల్లి/భీమిని: విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులు తయారు చేసిన టీఎల్ఎం మేళా ఎంతో తోడ్పడుతుందని పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు సూచించారు. తెలంగాణ ప్రభుత్వం విద్యార్థులకు సులువైన పద్ధతిలో విద్యను అందించేందుకు వినూత్న రీతిలో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని తెలిపారు. మండల కేంద్రాల్లోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన టీఎల్ఎం మేళాలో ఉపాధ్యాయులు తయారు చేసిన తెలుగు, ఇంగ్లిష్, గణితం, పరిసరాల పరిజ్ఞానంపై ఈ పోటీల్లో ప్రదర్శించారు. అనంతరం అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఉపాధ్యాయులకు బహుమతులు ప్రదానం చేశారు. జైపూర్‌లో ఎంఈవో కొమ్మెర రాధాకృష్ణమూర్తి, ఎంపీడీవో సత్యనారాయణ, ఎఫ్ఎల్ఎన్ కోడల్ అధికారి రవికుమార్, కాంప్లెక్స్ నోడల్ అధికారి అలీస్ మాధుర్య కోటపల్లిలో ఎంపీపీ సురేఖా, జిల్లా సెక్టోరల్ అధికారి చౌదరి, ఎంఈవో తిరుపతిరెడ్డి, భీమినిలో బెల్లంపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ నిరంజన్‌గుప్తా, ఎంఈఓ మహేశ్వర్‌రెడ్డి, ఎంపీపీ పోతురాజుల రాజేశ్వరి, జెడ్పీటీసీ పోతురాజుల గంగక్క, ఉపాధ్యాయులు తదితరులు హాజరయ్యారు.



జైపూర్: పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

సైబర్ నేరాలపై అవగాహన

బెల్లంపల్లి: విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని తాళ్లగురిజాల ఎస్సై రాజశేఖర్ అన్నారు. స్థానిక తెలంగాణ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల సెంటర్‌ఆఫ్ ఎక్సలెన్సీ (సీఓఈ) కళాశాలలో సైబర్ క్రైమ్ నేరాలపై బుధవారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రస్తుత ఆధునిక కాలంలో సెల్‌ఫోన్ వినియోగం గణనీయంగా పెరిగిందని, ఈ క్రమంలో సైబర్ క్రైమ్‌నేరాలు పెరుగుతున్నాయని తెలిపారు. తెలియని వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఓఈ కళాశాల ప్రిన్సిపాల్ సైదులు, వైస్ ప్రిన్సిపాల్ అజిత, ఉపాధ్యాయులు రాజేశ్వర్, గణపతి వామన్, సంతోష్, తిరుపతి, మల్లేష్, సుమిందర్, తేజ పాల్గొన్నారు.

వాడీవేడిగా మండల సమావేశం

- సమస్యలపై నిలదీసిన ప్రజాప్రతినిధులు

బెల్లంపల్లిరూరల్: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ గోమాస శ్రీనివాస్ అధ్యక్షతన మండల సర్వసమావేశం నిర్వహించారు. పలు శాఖల అధికారులు హాజరై నివేదికలు చదివి వినిపించారు. ఐకేపీ ఏపీఎం శ్యామల నివేదిక చదువుతుండగా సభ్యులు కలుగజేసుకుని ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహించే సమావేశాలకు, ప్రభుత్వ కార్యక్రమాలకు ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వడం లేదని మండిపడ్డారు. తాళ్లగురిజాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి అనీష్ మాట్లాడుతూ జనవరి 18నుంచి ప్రారంభించే రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఐసీడీఎస్ సీడీపీవో ఉమాదేవి నివేదిక చదువుతుండగా సభ్యులు మాట్లాడుతూ సోమగూడెంలో డీఎంఎఫ్‌టీ నిధులతో నూతన అంగన్‌వాడీ కేంద్రం నిర్మాణ పనులు ఇంకా ప్రారంభంకాకపోవడం పై నిలదీశారు. అంగన్‌వాడీలు గ్రామీణులకు మెరుగైన సేవలు అందించేలా చొరవ తీసుకోవాలని సూచించారు. విద్యుత్ శాఖ ఏ.ఈ రాంమనోహర్ నివేదిక చదువుతుండగా సభ్యులు కలుగజేసుకుని గ్రామాల్లో నిత్యం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతున్నా, విద్యుత్ సిబ్బంది పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. సమస్యలు తలెత్తినప్పుడు సిబ్బంది అందుబాటులో ఉండేలా చొరవ తీసుకోవాలన్నారు. పంచాయతీ రాజ్ ఏఈ పరంజ్యోతి నివేదిక చదువుతుండగా సభ్యులు అడ్డుకుని గ్రామ పంచాయితీల్లో పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో నిర్మించిన శ్మశానవాటిక నిర్మాణాలు పూర్తైనప్పటికీ సక్రమంగా బిల్లులు చెల్లించకపోవడంపై ఆగ్రహించారు. పూర్తి బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉపాధిహామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేయడానికి కుట్ర చేస్తోందని మండిపడ్డారు. ఎక్సైజ్ శాఖ ఎస్సై పాటిల్ నిర్మల నివేదిక చదువుతుండగా, సభ్యులు కలుగజేసుకుని గ్రామాల్లో గుడుంబా, బెల్ట్ షాపుల్లో మద్యం ఏరులై పారుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహించారు. గ్రామాల్లో గుడుంబా, బెల్ట్ షాపులను నియంత్రించాలని సూచించారు. అనంతరం పలు శాఖల అధికారులు తమ నివేదికలు చదివి సమావేశాన్ని మమా అనిపించారు. మందమర్రి సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన టోల్‌గేట్‌లో సమీప గ్రామాల వాహనదారులకు మినహాయింపు కలిగించాలని తీర్మానించారు. సమావేశంలో జెడ్పీ వైస్‌చైర్మన్ సత్యనారాయణ, కో–ఆప్షన్ సభ్యుడు చాంద్‌పాషా, వైస్ ఎంపీపీ రాణి, ఎంపీటీసీలు సుభాష్‌రావు, మల్లమ్మ, అంకుశం, శకుంతల, సర్పంచ్ అశోక్ గౌడ్, సురేష్, అశోక్, ఎంపీవో శ్రీనివాస్, సూపరింటెండెంట్ పూర్ణచందర్‌రావు, ఏవో ప్రేమ్‌కుమార్, హెచ్ఈవో సమ్మయ్య, సీనియర్ అసిస్టెంట్ కొండయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతి, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ఏపీఎం శ్యామలను నిలదీస్తున్న సభ్యులు

ప్రమాద రహిత ఉత్పత్తిని సాధించాలి

శ్రీరాంపూర్: ప్రమాదరహిత ఉత్పత్తిని సాధించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి తెలిపారు. ఆర్కే 6, ఆర్కే 5గనిపై బుధవారం ఆయన నూతన సంవత్సరం సందర్భంగా కార్మికులను కలిసి వారినుద్దేశించి మాట్లాడారు. రక్షణపై అవగాహన కలిగి ఉండి విధుల్లో రక్షణ సూత్రాలు పాటిస్తూ పనిచేయాలన్నారు. ఆర్కే 6, ఆర్కే 5 గని అధికారులు తదితరులు పాల్గొన్నారు. శ్రీరాంపూర్ వీటీసీలో శిక్షణ తీసుకుంటున్న ఫ్రంట్‌లైన్ సూపర్‌వైజర్లు, ఉద్యోగులు ఆర్కే 8 డిస్పెన్సరీలో రక్తదానం శిబిరం ఏర్పాటు చేయగా, జీఎం సంజీవరెడ్డి వారికి సర్టిఫికెట్లు అందించారు. వీటీసీ నుంచి ఇప్పటికి 13సార్లు రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి సుమారు 587యూనిట్ల రక్తందానం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో గుర్తింపు సంఘం టీబీజీకేఎస్ బ్రాంచీ ఉపాధ్యక్షుడు సురేందర్‌రెడ్డి, ఎంవీటీసీ మేనేజర్ రామారావు, డీవైసీఎంవో రమేశ్‌బాబు, సీనియర్ సెక్యూరిటీ అధికారి మురళీమోహన్, హెల్త్ ఆఫీసర్ లోకనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.



అవార్డుతో హర్షం వ్యక్తం చేస్తున్న సివిక్ కార్మికులతో జీఎం, ఇతర అధికారులు

12 నుంచి సురభి నాటకోత్సవం

శ్రీరాంపూర్: ప్రఖ్యాత సురభి కళాకారుల నాటకోత్సవం ఈ నెల 12 నుంచి 16 వరకు శ్రీరాంపూర్ ప్రగతి మైదానంలో నిర్వహించనున్నట్లు జీఎం సంజీవరెడ్డి తెలిపారు. దీనికి సంబంధించిన పోస్టర్లను ఆయన తనచాంబర్‌లో ఆవిష్కరించారు. తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక సమాఖ్య శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

స్వచ్ఛతా అవార్డుపై సంబురాలు

శ్రీరాంపూర్: ఇటీవల జరిగిన సింగరేణి డే వేడుకల్లో కంపెనీ స్థాయిలో స్వచ్ఛతా పక్వాడా కార్యక్రమాన్ని దిగ్విజయంగా నిర్వహించినందుకు గాను శ్రీరాంపూర్ ఏరియాకు కంపెనీ అవార్డును అందించింది. ఈ అవార్డుపై రావడం వెనుక కృషి చేసిన సివిక్ కార్మికులు, సివిల్ అధికారులు కలిసి సంబురాలు నిర్వహించగా జీఎం సంజీవరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఉద్యోగులను అభినందించారు.

అక్రమ మైనింగ్‌ను అరికట్టాలి

రామకృష్ణాపూర్: మందమర్రి మండలం బొక్కలగుట్టలో ఎలాంటి అనుమతులు లేకుండా బ్లాస్టింగ్ పనులు చేపడుతున్నారని బీఎస్పీ మహిళా విభాగం జోనల్ కన్వీనర్ భవానీ, జిల్లా కన్వీనర్ బొడ్డు వినోద ఆరోపించారు. అక్రమ తవ్వకాల వల్ల, బ్లాస్టింగ్‌ల వల్ల గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులుపడుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవటం లేదని వాపోయారు. స్థానిక ప్రజాప్రతినిధి భాగస్వామ్యంతోనే గుట్ట తవ్వకాలు జరుతున్నాయని బుధవారం ఆమె ఆరోపించారు. అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

'ఇది కార్మికుల విజయమే'

రామకృష్ణాపూర్: జాతీయ సంఘాల పోరాటాల ఫలితంగానే మెరుగైన వేజ్‌బోర్డు ఒప్పందాన్ని సాధించామని ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి అక్బర్‌అలీ అన్నారు. మందమర్రి ఏరియాలోని ఆర్‌కేపీ ఓసీ, సీహెచ్‌పీలలో బుధవారం నిర్వహించిన గేట్‌మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. 19శాతం మినిమం గ్యారంటీ బెనిఫిట్ సాధించటం గొప్ప విషయమన్నారు. ఇది ముమ్మాటికి కార్మికుల విజయమన్నారు. కార్యక్రమంలో యూనియన్ బ్రాంచి ఉపాధ్యక్షుడు లింగయ్య, అంజనేయులు, సంజీవ్, రామకృష్ణ, హరిరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బొగ్గుబాయి వార్తలు

బీసీ ఉద్యోగుల సంఘం కన్వీనర్‌గా మారుతి

శ్రీరాంపూర్: సింగరేణి బీసీ ఎంప్లాయిస్ అసోసియేషన్ శ్రీరాంపూర్ ఏరియా కన్వీనర్‌గా బరుపాటి మారుతిని నియమిస్తున్నట్లు అసోసియేషన్ ప్రెసిడెంట్ నాగేశ్వర్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓసీపీలో పనిచేస్తున్న మారుతి ఇక నుంచి సింగరేణిలో బీసీ ఉద్యోగుల సమస్యలపై చర్చించడం, వారి హక్కుల కోసం పోరాడటం కోసం పనిచేస్తారని తెలిపారు. బీసీలంతా ఐక్యంగా ఉండి హక్కులు సాధించుకుంటామని నూతనంగా ఎన్నికైన మారుతి తెలిపారు.

చర్యలు తీసుకోవాలి

బెల్లంపల్లిరూరల్: మండలంలోని బుధాకలాన్ గ్రామ పంచాయతీలో జూనియర్ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వర్తిస్తున్న హరికృష్ణపై చర్యలు తీసుకోవాలని పలువురు గ్రామస్తులు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీడీవో రాజేందర్‌కు వినతిపత్రం అందజేశారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీ

తాండూర్: మండలంలోని ఎరువుల దుకాణాలు, గోదాంలలో వ్యవసాయ అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు.

సంక్షిప్త వార్తలు

బెల్లంపల్లి వ్యవసాయశాఖ ఏడీఏ సురేఖ, మండల వ్యవసాయ అధికారులతో కలిసి బుధవారం ఎరువుల దుకాణాల స్టాక్ రిజిష్టర్లను, బిల్ పుస్తకాలను పరిశీలించారు. డీలర్లు వ్యవసాయశాఖ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

మందమర్రిరూరల్: మండలంలోని సారంగపల్లికి చెందిన శెట్టి కృష్ణ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. 'సారంగపల్లి యువసేన సైన్యం' వాట్సప్ గ్రూపు యువకులు విరాళంగా రూ.76వేల నగదు, రూ.4500విలువైన నిత్యావసర సరుకులు, 3 క్వింటాళ్ల 25కిలోల బియ్యం సేకరించి జెడ్పీటీసీ రవి, ఎస్సై చంద్రకుమార్ చేతుల మీదుగా బాధితురాలైన సుజాతకు అందజేశారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

భీమిని: మండలంలోని వెంకటాపూర్‌లో బుధవారం క్రికెట్ టోర్నమెంట్‌ను బెల్లంపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ బోనగిరి నిరంజన్ గుప్తా ప్రారంభించారు.

మోదీ నాయకత్వాన్ని బలపరచండి

జన్నారం: పేదల సంక్షేమం కోసం పాటుపడుతున్న పీఎం నరేంద్రమోదీ నాయకత్వాన్ని బలపరుచాలని, వచ్చే ఎన్నికల్లో బీజేపీని ఆదరించాలని బీజేపీ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి అజ్మీరా హరినాయక్ పేర్కొన్నారు. తిమ్మాపూర్‌లో గడపగడపకు తిరిగి బీజేపీ పథకాలు వివరించారు.

పోస్టర్ల ఆవిష్కరణ

కాసిపేట: మండలంలోని సోమగూడం చౌరస్తాలో ఈ నెల 9న హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే కామ్రేడ్ భీంరెడ్డి నర్సింహారెడ్డి శతజయంతి వార్షికోత్సవాల పోస్టర్లను ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి సబ్బని కృష్ణ ఆధ్వర్యంలో బుధవారం ఆవిష్కరించారు.